# విలుకాడు

## పాలో కొయిలో రచనలు

దిఆల్కెమిస్ట్
ది పిల్‌గ్రిమేజ్
ది వాల్కరీస్ బైది రివర్ పెడ్రా
ఐ సాట్ డౌన్ అండ్ వెప్ట్
ది ఫిఫ్త్ మౌంటేన్
వెరోనికా డిసైడ్స్ టుడై
వారియర్ ఆఫ్ ది లైట్: ఎ మాన్యువల్ ఎలెవన్ మినట్స్
ది జాహీర్
ది డెవిల్ అండ్ మిస్ ప్రైమ్
ది విచ్ ఆఫ్ పోర్టొబెల్లో
బ్రిడా
ది విన్నర్ స్టాండ్స్ అలోన్
అలెఫ్
మాన్యుస్క్రిప్ట్ ఫౌండ్ ఇన్ అక్రా
అడల్టరీ
ది స్పై
హిప్పీ

## పాలో కొయిలో

ఆల్కెమిస్ట్ రచయిత


# విలుకాడు


బొమ్మలు : క్రిస్టోఫ్ నీమన్

ఆంగ్ల అనువాదం: మార్గరెట్ జుల్ కోస్టా

తెలుగు అనువాదం : ఆకెళ్ళ శివప్రసాద్



MANJUL

మంజుల్ పబ్లిషింగ్ హౌస్

*First published in India by*

MANJUL

**Manjul Publishing House**

*Corporate and Editorial Office*
•2 Floor, Usha Preet Complex, 42 Malviya Nagar, Bhopal 462 003 - India
*Sales and Marketing Office*
•7/32, Ansari Road, Daryaganj, New Delhi 110 002 - India
Website: www.manjulindia.com

*Distribution Centres*
Ahmedabad, Bengaluru, Bhopal, Kolkata, Chennai,
Hyderabad, Mumbai, New Delhi, Pune

Telugu translation of *The Archer*

Copyright © 2003, Paulo Coelho
http://paulocoelhoblog.com
Illustrations copyright ©2017, Christoph Niemann,
Diogenes Verlag AG Zurich
All rights reserved

Originally published as *O Caminho Do Arco*
by Sant Jordi Asociados

English translation copyright © 2003, Margaret Costa

This Telugu edition published in 2021 by arrangements with Sant Jordi
Asociados Agencia Literaria S.L.U., Barcelona, Spain
http://www.santjordi-asociados.com/

**ISBN 978-81-950415-9-6**

Translation by Akella Sivaprasad

All rights reserved. No part of this publication may be reproduced, stored in or introduced into a retrieval system, or transmitted, in any form, or by any means (electronic, mechanical, photocopying, recording or otherwise) without the prior written permission of the publisher. Any person who does any unauthorized act in relation to this publication may be liable to criminal prosecution and civil claims for damages.

సెయింట్-మాటిన్ వద్ద
ఒకరోజు నేను క్వ్యాడో సాధన చేసినప్పుడు చూసిన
లియొనార్డ్ ఒటిసికా ఈ పుస్తకం రాయడానికి
ఆలోచన మొలకెత్తించారు.

*నిష్కళంకంగా గర్భం దాల్చిన మేరీ*

*నీ శరణు కోరిన మా కోసం ప్రార్థించు*

-ఆమెన్


ప్రయత్నం లేని ప్రార్థన
నారిలేని విల్లు వంటిది;


ప్రార్థనలేని ప్రయత్నం
విల్లులేని నారి లాంటిది.

–ఎల్లా వీలర్ విల్‌కాక్స్

# విషయ సూచిక


| | |
|---|---|
| నాంది | 1 |
| సహచరులు | 15 |
| విల్లు | 29 |
| బాణం | 35 |
| లక్ష్యం | 41 |
| భంగిమ | 51 |
| బాణాన్ని ఎలా పట్టుకోవాలి | 59 |
| విల్లు ఎలా పట్టుకోవాలి | 67 |
| వింటి నారిని లాగడం ఎలా | 73 |
| లక్ష్యాన్ని ఏ విధంగా చూడాలి | 81 |
| విడుదల చేసిన క్షణం | 89 |
| పునరావృతం | 97 |
| బాణం వెళ్లడాన్ని ఏ విధంగా పరిశీలించాలి | 107 |
| విల్లు, బాణం, లక్ష్యం లేని విలుకాడు | 117 |
| ఉపసంహారం | 125 |
| కృతజ్ఞతలు | 133 |





# నాంది



"టెట్సుయా"

కుర్రవాడు ఉలిక్కిపడి అపరిచితుడివైపు చూశాడు

"టెట్సుయా విల్లు పట్టుకోవడం ఈ గ్రామంలో ఎవరూ చూడలేదు" అన్నాడతను.

"ఇక్కడ అందరికి అతను వడ్రంగిగానే తెలుసు" అన్నాడు.

"బహుశ వదిలేశాడేమో, ధైర్యం కోల్పోయేడేమో, అది నాకనవసరం" అని పట్టుగా అన్నాడతను. విద్యను వదిలిపెట్టేసి నట్టయితే అతనిని అత్యుత్తమ విలుకాడుగా పరిగణించ కూడదు. నేను ఇన్ని రోజులు ప్రయాణం చేసి, అతనితో పోటీపడడానికి, ఏమాత్రం అర్హతలేని అతని పేరుప్రఖ్యాతులకు ముగింపు పలకడానికి వచ్చాను" అన్నాడు.

అతనితో వాదనకు అర్థం లేదని బాలునికి తోచింది. ఆ మనిషిని వడ్రంగి అంగడికి తీసుకుపోవడం మేలు అనిపించింది. అప్పుడతను స్వయంగా చూచి తాను పొరబడినట్టు తెలుసుకుంటాడు, అనుకున్నాడతను.

టెట్సుయా తన ఇంటి వెనుక నున్న వర్క్‌షాపులో ఉన్నాడు. ఎవరు వచ్చారా లోపలికి అని వెనుదిరిగి చూశాడు. అతని చూపు ఆ అపరిచితుడు తెచ్చిన పొడవాటి సంచీమీద పడి నవ్వు ఆగిపోయింది.

"సరిగ్గా నువ్వు అనుకుంటున్నదే" అన్నాడు ఆ కొత్తగా వచ్చిన వ్యక్తి. "ప్రసిద్ధుడయిన మనిషిని అవమానించడానికో, లేదా రెచ్చగొట్టడానికో రాలేదు నేను."

"ఎన్నో ఏళ్ళ సాధన తర్వాత నేను పరిపూర్ణతను సాధించగలిగానని రుజువు చేయడానికి వచ్చాను".

టెట్సుయా తిరిగి పనిచేసుకుంటున్నట్టుగా కదిలాడు. అతను ఒక బల్లకు కాళ్లు అమరుస్తున్నాడు. కాళ్ళు రెండూ నేలమీద ఆన్చి నిల్చున్నాడు.

"మొత్తం తరానికి ఒక ఉదాహరణగా నిలిచిన వ్యక్తి, నీలాగ అదృశ్యమైపోకూడదు... అంటూ, "నేను నీ బోధనలను అనుసరించాను. విల్లు తీరును గౌరవించడానికి ప్రయత్నించాను. మీరు నా విలువిద్యను చూచి తీరాలి.

ఇది మీరు చూస్తే నేను వెళ్లిపోతాను. గురువులందరిలోకి గొప్ప వ్యక్తి ఎక్కడ దొరుకుతాడన్నది కూడా నేను ఎవరికీ చెప్పను" అన్నాడతను.

ఆ అపరిచితుడు తన సంచీ నుండి ఒక పొడవైన విల్లుని తీశాడు. అది వార్నిష్ పూసిన వెదురు కర్రతో తయారు చేసినది. పట్టుకునే చోటు మధ్య భాగానికి కిందుగా ఉంది.

అతను టెట్సుయాకు నమస్కరించి తోటలోకి వెళ్లాడు. ఒకే వేపు తిరిగి నమస్కరించాడు. తర్వాత ఈకలతో ఉన్న బాణం బయటకు తీశాడు. నేలపై రెండు కాళ్లను గట్టిగా కదలకుండా పెట్టాడు. గురిచూసి కొట్టడానికి అది ఒక దృఢమైన ఆధారంగా చేసుకున్నాడు. ఒక చేత్తో బాణాన్ని ముందుకు మొహం వైపుగా తీసుకువచ్చాడు. మరో చేత్తో బాణాన్ని సరి చేసుకున్నాడు.

బాలుడు ఆనందాన్ని, ఆశ్చర్యాన్ని మిళితం చేసి చూస్తున్నాడు.

టెట్సుయా పని ఆపి అపరిచితుడిని కొంత కుతుహలంతో గమనించసాగాడు.

వింటినారికి బాణాన్ని సంధించి తన ఛాతి మధ్య భాగానికి సమానంగా వచ్చేలా విల్లుని పైకెత్తాడు.

దాన్ని తలకన్నా పైకి ఎత్తాడు, నెమ్మదిగా మళ్లీ చేతిని కిందికి దించుతూ వింటి నారిని వెనక్కి లాగడం ప్రారంభించాడు. బాణం సరిగ్గా తనముఖానికి సమంగా వచ్చేసరికి విల్లును పూర్తిగా సంధించి ఉంది. ఒక్క క్షణం బాణం గురి పెట్టబడి ఉన్న ప్రదేశాన్ని ఆ బాలుడు చూశాడు. అక్కడ అతనికి ఏమీ కనిపించలేదు.

అకస్మాత్తుగా వింటి తాడుపై ఉన్న చెయ్యి తెరుచుకున్నది. చెయ్యి వెనుకకు కదిలింది. మరో చేతిలో విల్లు అందమైన ఆర్క్‌గా కనిపించింది. అదృశ్యమై, కొంత దూరంలో తిరిగి కనిపించింది.

"వెళ్లి దానిని తీసుకురా" అన్నాడు టెట్సుయా.

కుర్రవాడు బాణంతో తిరిగి వచ్చాడు. అది ఒక చెర్రీని ఛేదించింది. అది కిందపడి ఉంది. నలభై మీటర్ల దూరంలో ఉందది.

టెట్సుయా ఆ విలుకానికి నమస్కరించాడు. తన వర్క్‌షాపులోని ఒక మూలకు వెళ్లి సన్నగా ఉన్న చెక్క ముక్కని తీశాడు. సున్నితంగా వంచాడు. దానిని ఒక పొడవాటి బెల్ట్‌స్ట్రిప్‌తో నెమ్మదిగా తోలు దెబ్బ తినకుండా విప్పి, అపరిచితుడి వద్దనున్న విల్లును పోలి ఉన్న విల్లుని తయారు చేశాడు. ఇది మరింత విశిష్టమైనదిగా కనిపించింది.

"నా దగ్గర బాణాలు లేవు. కాబట్టి నీ బాణాలలోని ఒక దాన్ని ఉపయోగించాల్సి ఉంటుంది. మీరు అడిగినట్లే నేను చేస్తాను, కానీ మీరు చేసిన ప్రమాణాన్ని మీరు నిలబెట్టుకోవాలి. మీరు నేను నివసిస్తున్న ఈ గ్రామం పేరు ఎప్పటికీ బయటపెట్టకూడదు".

"ఎవరైనా నా గురించి అడిగితే, నా కోసం భూమి అంచుల వరకు వెళ్లాననీ, చివరికి నన్ను ఒక పాము కాటు వేయగా రెండు రోజుల తర్వాత మరణించానని తెలిసిందని చెప్పండి"

అపరిచితుడు అలాగేనని తల ఊపాడు. తన బాణాలలో ఒకటి ఇచ్చాడు.

పొడవైన వెదురు విల్లు ఒక చివరను గోడకు నొక్కిపెట్టి తర్వాత, ఒక్క మాట కూడా మాట్లాడకుండా పర్వతాల దిశగా బయల్దేరాడు. అపరిచితుడు, కుర్రవాడు అతనితో వెళ్ళారు. వారు ఒక గంట సేపు నడిచి రెండు రాళ్ల మధ్య నుంచి వేగంగా ప్రవహిస్తున్న నది వద్దకు వచ్చి ఆగారు. దాదాపు కూలిపోయే దశలో ఉన్న తాళ్లవంతెన మీద నుంచి నదిని దాటాల్సి ఉంది.

చాలా ప్రశాంతంగా టెట్సుయా వంతెన మధ్యకు ఎంతో అప్రమత్తంగా నడిచాడు. మరో వైపు దేనికో నమస్కరించాడు. అపరిచితుడి లాగే వింటికి బాణం పెట్టి పైకి ఎత్తాడు. తిరిగి కిందకు దించి తన ఛాతీ ఎత్తులోకి తీసుకువచ్చి బాణం వదిలాడు.

దాదాపు ఇరవై మీటర్ల దూరంలో బాగా పండిన పీచ్ పండుకు బాణం గుచ్చుకోవడాన్ని, బాలుడు, అపరిచితుడు చూశారు.

"నువ్వు చెర్రీ కొడితే, నేను పీచ్‌ని కొట్టాను." అన్నాడు టెట్సుయా.

వంతెన దిగి సురక్షిత ప్రాంతానికి చేరాడతను.

"చెర్రీ చిన్నది. నువ్వు దానిని నలభై మీటర్ల దూరం నుంచి లక్ష్యంగా చేసుకున్నావు. నా లక్ష్యం అందులో సగం.

అందువల్ల మీరు నేను చేసిన దాన్ని మళ్లీ చేయగలగాలి. వంతెన మధ్యలో నిలబడండి. నేను చేసినట్లుగా చేయండి". అన్నాడు.

గొప్ప భయంతో ఆ అపరిచితుడు శిథిలావస్థలో ఉన్న వంతెన మధ్య భాగంలోకి వెళ్లాడు. కింద నుంచి ఉన్నఎత్తు కారణంగా అతను బిగదీసుకుపోయాడు. అతను టెట్సుయా చేసినట్లే చేసి పీచ్ చెట్టుకి గురిచూసి కొట్టాడు. బాణం వేగంగా ముందుకు వెళ్లిపోయింది. ఒడ్డుకి


తిరిగి వచ్చేటప్పటికి అతని ముఖం రక్తపు చుక్క కనబడకుండా పాలిపోయి ఉంది.

"మీకు నైపుణ్యం ఉంది, దర్పం తీరు ఉన్నాయి" అన్నాడు టెట్సుయా.

"మీకు విధానం గురించి మంచి అవగాహన ఉంది. విల్లుపై మంచి పట్టు ఉంది. కానీ మనస్సుపై పట్టు లేదు. పరిస్థితులన్నీ సానుకూలంగా ఉన్నప్పుడు ఎలా బాణం గురి చూసి కొట్టాలో తెలుసు, కానీ ప్రమాదకరమైన నేల మీద ఉన్నప్పుడు లక్ష్యాన్ని కొట్టడం తెలియదు. విలుకాడు ఎల్లప్పుడు యుద్ధ రంగాన్ని ఎంచుకోలేడు. శిక్షణ మళ్లీ ప్రారంభించు. అనుకూలం కాని పరిస్థితులలో బాణం వేయడం నేర్చుకో".

బాణ విద్యలో ముందుకు సాగు. అది జీవితమంతా కొనసాగించవలసిన ప్రయాణం. కానీ గుర్తుంచుకో మంచి కచ్చితమైన వేటు ఆత్మానందం కల్గించే దానికన్నా వేరుగా వుంటుంది. అపరిచితుడు సాచి వంగి వందనం చేసి భుజానికి తగిలించుకున్న పొడవైన సంచీలో విల్లు, బాణాలు పెట్టుకుని వెళ్లిపోయాడు.

తిరిగి వస్తుండగా కుర్రవాడు సంతోషంతో ఉప్పొంగిపోతూ, "టెట్సుయా! మీరు అతనికి దారి చూపించారు. మీరు నిజంగా అందరికన్నా గొప్పవారు" అన్నాడు.





"ముందుగా వ్యక్తులు చెప్పింది వినడం, గౌరవించడం చేసిన తర్వాతే వారి గురించి ఒక నిర్ణయానికి రావాలి. ఆ అపరిచితుడు మంచి మనిషి: అతను నన్ను అవమానించలేదు, లేదా అతను నాకంటే ఉత్తముడని నిరూపించుకునే ప్రయత్నం చేయలేదు. అతను తన కళను ప్రదర్శించాలనుకున్నాడు. దానికి గుర్తింపు పొందాలనుకుని ఇక్కడికి వచ్చాడు. ఊహించని ప్రయత్నాలు చేయడం, సంధించడంలో భాగం. ఈరోజు అపరిచితుడే నాచేత వూహించనిదే చేయించాడు.

"మీరు తనకంటే గొప్పవారని అన్నాడు. మీరు గొప్ప విలుకాడని నాకు ఇంత వరకు తెలియదు. మరి మీరెందుకు వడ్రంగి పని చేస్తున్నారు?"

"ఎందుకంటే విల్లు విధానం అన్నింటికీ వర్తిస్తుంది. కలపతో పని చేయాలన్నది నా కల. అంతే కాకుండా విలుకాడు అనుసరించే మార్గంలో విల్లు లేదా బాణం లేదా లక్ష్యం అవసరం లేదు".

"ఈ గ్రామంలో ఏనాడూ ఆసక్తికరమైన సంఘటనలు జరగలేదు. ఇప్పుడు హఠాత్తుగా నేను ఒక కళకు సంబంధించిన గురువుతో, అది కూడా కనీసం ఏ మాత్రం ఎవరూ పట్టించుకోని ఓ గురువు ఎదురుగా ఉన్నాను" అన్నాడు కుర్రవాడు.

కుర్రవాడి కళ్లు మెరుస్తున్నాయి. "విల్లు మార్గం అంటే ఏమిటి? నాకు బోధిస్తారా?"

"దానిని గురించి బోధించడం ఏమంత కష్టం కాదు. ఒక గంట కంటే తక్కువ సమయంలోనే గ్రామానికి నడుచుకుంటూ తిరిగి వెళ్తున్నప్పుడే చెప్పగలను. అవసరమైనంత ఖచ్చితత్వం సాధించే వరకు ప్రతి రోజు సాధన చేయడమే కష్టం"

ఆ కుర్రవాడి చూపులు తనని అంగీకరించమని అర్థిస్తున్నట్లుగా ఉన్నాయి.

టెట్సుయా దాదాపు పదిహేను నిమిషాల పాటు మౌనంగా నడిచాడు. మాట్లాడడం ప్రారంభించగానే అతని స్వరం యువకుడి స్వరంలా వినిపించసాగింది.

"ఈ రోజు నాకు చాలా సంతృప్తిగా ఉంది. కొన్ని సంవత్సరాల క్రితం నా ప్రాణం కాపాడిన వ్యక్తిని నేను గౌరవించుకున్నాను. ఆ కారణం వల్లనే నేను నీకు అవసరమైన అన్ని నియమాలు నేర్పిస్తాను, అంతకన్నా నేనే ఏమీ చేయలేను. నేను చెప్పినవి నువ్వు అర్థం చేసుకోగలిగితే, వాటిని నువ్వు కావాల్సిన రీతిలో ఉపయోగించుకోవచ్చు. ఇప్పుడు, కొన్ని నిమిషాల క్రితం నువ్వు నన్ను గురువు అన్నావు. గురువు అంటే ఏమిటి?

నా అభిప్రాయం ఏదో ఒకటి చెప్పే ఎవరో ఒకరు కాదు.

వారి ఆత్మలో ఇప్పటికీ ఉన్న జ్ఞానాన్ని కనుగొనేలా విద్యార్థులను ఎవరైతే బాగా ప్రేరేపించగలుగుతారో వారే గురువు".

వారు కొండ దిగి వచ్చేటప్పటికి టెట్సుయా విల్లురీతి గురించి వివరించాడు.





# సహచరులు



విల్లు, బాణం ఆనందాన్ని ఇతరులతో పంచుకోని విలుకాడు తన గుణగణాలను, తప్పులను ఎప్పటికీ తెలుసుకోలేడు.

అందువల్ల ఏదైనా పనిప్రారంభించే ముందు నువ్వు చేస్తున్న పనిలో ఆసక్తిగల సహాయకులను వెదుకు. నేను చెబుతున్నది "ఇతర విలుకాళ్లను వెతకమని కాదు" నేను చెప్తున్నది ఇతర నైపుణ్యాలు గల వారిని కనిపెట్టు. ఎందుకంటే విల్లు మార్గం, అత్యుత్సాహంతో అనుసరించే ఇతరమార్గాలకన్నా భిన్నమైంది కాదు.

మీ మిత్రులు వెలిగిపోతూ  ఉండాల్సిన అవసరం లేదు. అందరు వారిని చూచి వీళ్లకన్నా గొప్పవాళ్లు లేరు అనవలసిన అవసరం లేదు. పైగా తప్పులు చేయడానికి భయపడని వారు, ఒక వేళ ఏదైనా పని చేసినా తప్పులు చేస్తారు కాబట్టి వారి పని గుర్తింపుకు నోచుకోదు. అయినప్పటికీ, వారు ప్రపంచాన్ని మార్చగల వ్యక్తులు, ఎన్నో తప్పుల తరువాత, వారు వారి సమాజానికీ కచ్చితమైన తేడాని చూపగలిగే అంశాన్ని అందించ గల్గుతారు. అలాంటి వారు చాలు.

మరికొంతమందికి జరుగుతున్న వ్యవహారాలను చూసి ఏవైఖరి అవలంబించాలనేది నిర్ణయించడానికి వేచి ఉండే ఓపిక ఉండదు. వారిష్టంవచ్చినట్లు నిర్ణయం తీసుకుంటారు. ఇది అత్యంత ప్రమాదకరమని రుజువైందని తెలిసీ అలాగే చేస్తారు.


అటువంటి వ్యక్తులతో కలిసి జీవించడం ఒక విలుకాడుకి ఎంతో ముఖ్యం. ఎందుకంటే, అతను లక్ష్యాన్ని ఎదుర్కోకముందే, విల్లును ఛాతి వద్దకు తెచ్చినప్పుడే, దిశను మార్చుకోవడానికి తగిన స్వేచ్ఛా భావన కలిగి ఉండాలి. అతను వింటి నారిని లాగి వదిలినప్పుడు తనలోతాను “నేను విల్లును లాగుతున్నప్పుడు, సుదీర్ఘమైన మార్గంలో ప్రయాణిస్తున్నాను. ఇప్పుడు నేను బాణాన్ని వదులుతున్నానంటే అవసరమైన విపత్తులను ఎదుర్కొని, అత్యుత్తమమైనది అందిస్తాను” అనుకోవాలి.


మంచి మిత్రులంటే మిగతావారిలాగా ఆలోచించని వారు. అందుకే మీరు విలువిద్యలో మీ ఉత్సాహాన్ని పంచుకోవడానికి సహచరులని ఎంచుకున్నప్పుడు అంతర్ దృష్టిని నమ్ముకోండి. ఎవరేం చెప్పినా పట్టించుకోకండి. ప్రజలు ఎల్లప్పుడూ ఇతరులని తమ పరిమితులను ప్రమాణాలుగా తీసుకుని లెక్కకడతారు. వారి అభిప్రాయాలు తరచు పూర్తిగా పక్షపాతం, భయంతో కూడా ఉంటాయి.

ప్రయోగాలు చేసి, ప్రమాదాలు ఎదుర్కొని, పడిపోయి, గాయపడి, మళ్ళీ మరిన్ని ప్రమాదాలు ఎదుర్కొనే వారందరితో కలవండి.

సత్యాలను ధృవీకరించి వారి నుండి, వారిలా ఆలోచించలేదని విమర్శించే వారి నుండి,  ఖచ్చితంగా ఫలితం వస్తుందని, గౌరవం అందుతుందని తెలీకపోతే అడుగుముందుకు వేయని వారి నుండి, సందేహాలకన్నా నమ్మకాలకి ప్రాధాన్యత యిచ్చేవారి నుండి దూరంగా వుండండి.

తెరిచిన మనసుతో, దేనికైన భయపడకుండా వుండేవారితో కలవండి. తమ సహచరులు చేస్తున్న దానిని గమనించి తమని తాము మెరుగుపరుచుకొంటారని వీరు అర్థం చేసుకుంటారు. సహచరుల అంకితభావాన్ని, ధైర్యాన్ని, ప్రశంసిస్తారు తప్ప వారిని బేరీజు వేయరు.





రొట్టెలు కాల్చేవాడికి గానీ రైతుకుగానీ విలువిద్యలో ఆసక్తి ఉండదని నువ్వు అనుకోవచ్చు.

కానీ వాళ్లు ఏది చూస్తే దానిని వారు చేసే పనిలో ప్రవేశపెడతారు అని నీకు భరోసా ఇవ్వగలను. నువ్వు అలాగే చేస్తావు. ఒక మంచి బేకర్ నుండి నువ్వు చేతులను ఎలా ఉపయోగించాలి. దినుసులన్నిటిని సరిగా ఎలా కలపాలి అనే విషయాలు నేర్చుకుంటావు.

రైతు నుంచి నువ్వు సహనం, కష్టపడి పనిచేయడం ఋతువులను గౌరవించడం, తుఫానులను నిందించకుండా వుండడం నేర్చుకుంటావు. ఎందుకంటే నిందించడమంటే సమయం వృథాచేయడమే.

మీ విల్లు కర్రవలె అనువైన వారితో, దారి పొడవునా మీ సంకేతాలను అర్థం చేసుకునే వారితో కలవండి.

అవాంఛనీయ అవరోధాలు ఎదురైనప్పుడు లేదా మంచి అవకాశాలను చూసినప్పుడో కొంతమంది తమ దిశ మార్చుకోవడానికి ఏ మాత్రం వెనుకాడరు. వారికి నీటి లక్షణాలు ఉంటాయి. నీరు, రాళ్ల చుట్టూ ప్రవహిస్తుంది. నదిగా రూపాంతరం చెందుతుంది. ఒక్కోసారి సరస్సులా మారుతుంది. సరస్సు నిండి పొంగినప్పుడు అది మళ్లీ తన ప్రయాణం కొనసాగిస్తుంది. ఎందుకంటే నీరు తన గమ్యస్థానం సముద్రం అనే విషయాన్ని ఎప్పటికీ మరిచిపోదు. ముందుగానో, వెనకగానో అది సముద్రాన్ని చేరుకోవాలి.

ఇది సరైనది, నేను ఇక దాన్ని మించి వెళ్లను," అని చెప్పని వారితో చేరండి. ఎందుకంటే శిశిర ఋతువు తర్వాత కచ్చితంగా వసంతకాలం వస్తుంది. ఎప్పటికీ ముగింపు వుండదు. మీరు మీ లక్ష్యాన్ని సాధించిన తర్వాత మీరు మళ్లీ ప్రారంభించాలి. మీ అనుభవంలో మీరు నేర్చుకున్నవాటినన్నిటినీ ఎల్లప్పుడూ ఉపయోగిస్తూ ఉండాలి.


గాయకులతో, కథలు చెప్పేవారితో, జీవితంలో ఆనందం పొందే వారితో, కళ్లల్లో ఆనందం కనిపించేవారితో చేరండి. ఎందుకంటే ఆనందం అంటువ్యాధిలాంటిది. వ్యాకులత, ఒంటరితనం, కష్టాల్లో కృంగిపోకుండా ఆనందం అడ్డుకట్టవేస్తుంది.

ఉత్సాహంగా వారిపని వారు చేసుకునే వారితో కలవండి. వారు మీకెంత ఉపయోగపడుతారో మీరు వారికి అంతే ఉపయోగపడతారు.

వారి పరికరాలను, నైపుణ్యాలను వారు ఎలా మెరుగుపరుచుకున్నారనే దానిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి.

మీ విల్లు, మీ బాణం, మీ లక్ష్యం మార్గాన్ని కలిసే సమయం ఆసన్నమైంది.

# విల్లు



విల్లు జీవితం, అన్ని రకాల శక్తులకు ఆధారం.

బాణం ఏదో ఒక రోజు వదిలి వెళ్తుంది.

లక్ష్యం చాలా దూరం.

కానీ విల్లు మీ దగ్గరే ఉంటుంది.

దానిని ఎలా కాపాడుకోవాలనేది తెలుసుకోవాలి.

దీనికై ఖాళీ సమయం అవసరం. విల్లు ఆయుధాలతో బిగించి కట్టడం వల్ల దాని శక్తిని కోల్పోతుంది. కొంతసేపు ఏంచేయకుండా ఉండవలసి రావచ్చు. అందువల్ల విశ్రాంతి తీసుకోనిస్తే అది తిరిగి దృఢత్వాన్ని పొందుతుంది.

అప్పుడు మీరు వింటినారిని లాగితే విల్లు దాని సర్వ శక్తులతో చెక్కు చెదరకుండా అద్భుతంగా ఉంటుంది.

విల్లుకి మనస్సాక్షి లేదు. అది చేతికి పొడిగింపు, విలుకాడికి కోరిక.

అది చంపడానికి లేదా ధ్యానానికి ఉపయోగపడ్తుంది.

అందువల్ల ఎల్లప్పుడు మీ ఉద్దేశాల విషయంలో మీరు స్పష్టంగా ఉండండి.

విల్లు వంగుతుంది. కానీ దాని పరిమితులు దానికుంటాయి.

దాని సామర్థ్యాన్ని మించి వంచితే విరిగి పోతుంది. లేదా దానిని పట్టుకున్నచేతిని నిస్సత్తువగా చేస్తుంది.

అందువల్ల మీరు మీ విల్లుతో సామరస్యంగా ఉండండి, దాని నుండి శక్తికి మించి ఆశించకండి.

విల్లు విశ్రాంతిగా వుంటుంది లేదా విలుకాడి చేతిలో ఉద్రిక్తంగానైనా వుంటుంది. కానీ చెయ్యి శరీరంలోని కండరాల సమూహం కలిగిన చోటు, విలుకాడి సకల ఉద్దేశ్యాలు, సర్వశక్తులు గురిపెట్టిన లక్ష్యంమీద కేంద్రీకృతమై వుంటాయి. అందువల్ల విల్లుని సంధించేటప్పుడు, మీలోని ప్రతి భాగం ఏది అవసరమో దానిని ఉపయోగించి, మీ శక్తులు వృథా అవ్వకుండా ఉపయోగపడాలి. అప్పుడే అలసట లేకుండా కావలసినన్ని బాణాలను సంధించగలుగుతారు.

మీ విల్లును అర్థం చేసుకోవాలంటే దాన్ని మీ చేతిలో భాగంగా, మీ ఆలోచనలకు ఒక పొడిగింపుగా భావించాలి.

# బాణం

బాణం అంటే ఒక ఉద్దేశ్యం.

ఇది విల్లు శక్తిని, లక్ష్యం కేంద్రంతో కలుపుతుంది.

ఉద్దేశ్యం బాగా స్పష్టంగా, సూటిగా సమతుల్యంగా ఉండాలి.

ఒక్కసారి బాణాన్ని వదిలితే, అది తిరిగి రాదు. కాబట్టి బాణం సంధించడానికి అంతరాయం కలిగించడం మంచిది. ఎందుకంటే దాని వరకు తీసుకెళ్లే కదలికలు, నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పోలిస్తే తగినంత స్పష్టమైనవి, సరైనవి కావు". ఎందుకంటే విల్లును పూర్తిగా లాగిన తర్వాత, లక్ష్యం ఎదురుచూస్తూ వుంటుంది.

అయితే బాణం వేయకుండా ఎప్పుడూ వెనక్కి తగ్గకండి.

ఒక వేళ శక్తిహీనులుగా భావిస్తున్నారంటే, పొరపాటు చేస్తామనే భయంతోనే. మీ కదలికలు సరిగా ఉంటే మీ చేతిని వదిలేయండి. బాణాన్ని విడుదల చేయండి. ఒక వేళ లక్ష్యాన్ని ఛేదించడంలో బాణం విఫలమైతే మరోసారి మీ లక్ష్యాన్ని మెరుగుపరచుకోవడం ఎలా అనేది నేర్చుకుంటారు. మీరు ఎప్పటికీ ప్రమాదం ఎదుర్కోలేకపోతే ఎలాంటి మార్పులు చేసుకోవాల్సిన అవసరముందో ఎప్పటికీ తెలుసుకోలేరు.

ప్రతి బాణం మీ హృదయంలో ఒక జ్ఞాపకాన్ని మిగులుస్తుంది. ఇలాంటి కొన్ని జ్ఞాపకాల పరంపర మీరు మరింత చక్కగా బాణాలు సంధించగల నైపుణ్యాన్ని అందిస్తుంది.



# లక్ష్యం



లక్ష్యం అంటే చేరవలసిన గమ్యం,

విలుకాడు దీనిని ఎంచుకుంటాడు.

లక్ష్యం చాలా దూరంలో ఉండవచ్చు.

లక్ష్య సాధనలో విఫలమైనా మనం అతన్ని నిందించలేము. ఈ దూరంలోనే వింటి అందం ఉంది. మీ ప్రత్యర్థి మీకన్నా బలవంతుడని మీరు భావిస్తే అది ఎన్నటికీ క్షమార్హం కాదు. లక్ష్యాన్ని ఎంపిక చేసుకునేది మీరే. మీరే దానికి బాధ్యత వహించాలి. లక్ష్యం పెద్దదో, చిన్నదో, కుడిపక్క లేదా ఎడమ వైపు ఉండవచ్చు. కానీ మీరు ఎల్లప్పుడు దాని ముందు నిలబడి, దానిని గౌరవించాలి. మీ మనస్సుకు దగ్గరగా తీసుకోవాలి. కేవలం బాణం కొన అక్కడ ఉన్నప్పుడే మీరు వింటి తాడును వదిలేయాలి.

కాబట్టి మీరు లక్ష్యాన్ని శత్రువుగా చూడగలిగితేనే బాగా గురి చూసి కొట్టగలుగుతారు. కానీ మీరు అంతర్గతంగా ఏమీ మెరుగుపరుచుకోలేరు. కాగితం ముక్క లేదా కర్ర ముక్క మధ్యలో బాణాన్ని పెట్టి మీరు కేవలం ప్రయత్నంతోనే జీవితం కొనసాగిస్తారు. ఇది కచ్చితంగా అర్థం లేని పని. అంతేకాదు మీరు ఇతరులతో కలిసినప్పుడల్లా, ఏ పనిని కూడా ఆసక్తిగా చేయలేదని ఫిర్యాదు చేస్తూ మీ సమయం గడుపుతారు.

మీ లక్ష్యాన్ని మీరు ఎంపిక చేసుకోండి దాన్ని ఛేదించడానికి శాయశక్తులా ప్రయత్నించండి. ఎల్లప్పుడు గౌరవప్రదంగా, హుందాగా పరిగణించండి. లక్ష్యం అంటే ఏమిటో మీరు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. మీవంతుగా ఎంత వరకు ప్రయత్నం, శిక్షణ, అంతర్దృష్టి అవసరమో తెలుసుకోవాలి.

మీరు లక్ష్యం వైపు దృష్టి సారించినప్పుడు కేవలం లక్ష్యం మీదనే కాకుండా దాని చుట్టూ ఉన్న విషయాలపైన కూడా దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ఎందుకంటే మీరు బాణాన్ని వదిలినప్పుడు గాలి, బరువు, దూరం వంటి వాటిని పరిగణనలోకి తీసుకోవడంలో మీరు విఫలమైతే వాటినన్నిటిని బాణం ఎదుర్కోవాల్సి వస్తుంది.

మీరు లక్ష్యాన్ని బాగా అర్థం చేసుకోవాలి. మిమ్మల్ని మీరు నిరంతరం ప్రశ్నించుకోవాలి. "ఒక వేళ నేను లక్ష్యమయితే, నేను ఎక్కడ ఉన్నాను? ఏ విధంగా ఛేదిస్తే విలుకాడుని గౌరవించినట్లు అవుతుంది? గౌరవం పొందే అర్హత విలుకాడుకి అందుతుంది. విలుకాడు ఉంటేనే లక్ష్యం కూడా ఉంటుంది.

లక్ష్యాన్ని ఛేదించాలనే విలుకాడి కోరికే, దాని ఉనికిని సమర్థిస్తుంది. లేకపోతే అది ఒక జీవం లేని వస్తువుగా, ప్రాముఖ్యతలేని కాగితం లేదా కర్రముక్కగా మిగిలిపోతుంది. బాణం లక్ష్యాన్ని కోరుకున్నట్లే, లక్ష్యం కూడా బాణాన్ని కోరుకుంటుంది. ఎందుకంటే బాణం వల్లే లక్ష్యం ఉనికికి ఒక అర్థం కలుగుతుంది. అది విలుకాడుకి ఒక కాగితం ముక్కగా మాత్రమే కాక అదే ప్రపంచంగా మారుతుంది.





# భంగిమ

విల్లు, బాణం, లక్ష్యం గురించి మీరు అర్థం చేసుకున్న తర్వాత, ఏ విధంగా సంధించడం నేర్చుకోవడానికి అవసరమైన పొందిక, ప్రశాంతత, లాలిత్యం కలిగి ఉండాలి.

ప్రశాంతత మనస్సులో నుండి వస్తుంది. తరుచు మనస్సు అభద్రత ఆలోచనలతో బాధపడ్తుంది. సరైన భంగిమ ద్వారా తను అత్యుత్తమ ప్రదర్శన యివ్వగలనని దానికి తెలుసు.





పొందిక పైపై మెరుగులకు సంబంధించినది కాదు. ఒక వ్యక్తి తన జీవితాన్ని తన పనులను,  ఏ విధంగా గౌరవిస్తున్నాడనే దానికి సంబంధించినది.

మీకు ఎప్పుడైనా మీ భంగిమ అసౌకర్యంగా అనిపిస్తే అది ఒక తప్పు లేదా కృత్రిమమైనదని భావించకండి. అది వాస్తవమైనది. ఎందుకంటే అది చాలా కష్టమైనది. అదే విలుకాడి గౌరవాన్ని పెంచడానికి లక్ష్యానికి అనుమతినిస్తుంది.

భంగిమలన్నిటిలో లాలిత్యంగా ఉండడమనే భంగిమ అంత సౌకర్యవంతమైనది కానప్పటికీ, గురి పరిపూర్ణంగా ఉండడానికి పొందికగా ఉండడం అనేది మంచి భంగిమ.

అనవసరమైన ప్రతి విషయాన్ని విస్మరించినప్పుడే పొందిక సాధించబడుతుంది, విలుకాడు సరళతను, ఏకాగ్రతను కనుగొంటాడు.

భంగిమ ఎంత స్థిర బుద్ధితో, సాధారణంగా ఉంటే అంత అందంగా ఉంటుంది. మంచు ఎంతో మనోహరంగా ఉంటుంది. ఎందుకంటే అది ఒకే రంగు కలిగి ఉంటుంది. సముద్రం ఎంతో మనోహరంగా కనిపించడానికి కారణందాని ఉపరితలం చదునుగా ఉన్నట్లు కనిపించడమే. కానీ సముద్రం, మంచు ఈ రెండూ కూడా లోతైనవే. వాటి స్వంత లక్షణాల గురించి వాటికి తెలుసు

# బాణాన్ని ఎలా పట్టుకోవాలి

బాణాన్ని పట్టుకోవడమంటే మీ ఉద్దేశ్యాన్ని తాకినట్లే.

బాణాన్ని కింది నుండి పైవరకు పరిశీలించండి. బాణం వెళ్లడానికి దోహదపడే ఈకలు, సాధనాలు సరిగా ఉన్నాయో లేదో చూడండి.

బాణం మొన పదునుగా ఉందో లేదో నిర్ధారించుకోండి. అది నేరుగా ఉందా లేక ఎక్కడన్నా వంకరగా ఉందా లేక ఇంతకు ముందు సంధించడంవలన ఏమన్నా దెబ్బతిందా అనేది నిర్ధారించుకోండి.



బాణం నిరాడంబరంగా, తేలికగా ఉండడంతో మీకు అది పెళుసుగా ఉన్నట్లు కనిపించవచ్చు. కానీ, విలుకాడి బలాన్ని అంటే అతని శరీరం, మనసులోని శక్తిని చాలా దూరం బాణం తీసుకుపోగలదు.

ఒక బాణం ఒకసారి ఓడను ముంచివేసిందని ఇతిహాసం చెప్తోంది. ఎలాగంటే చెక్క ఎక్కడ బలహీనంగా ఉందో ఆ వ్యక్తికి తెలుసు. దాంతో సరిగా గురిచూసి ఆ బిందువు దగ్గర బాణంతో కొట్టి రంధ్రం చేయడంతో, నీరు నిశ్శబ్ధంగా ఓడలోకి ప్రవేశించింది. దాంతో తమ గ్రామంపై ఆక్రమణకు వస్తున్న ఆ ఓడలోని ఆక్రమణదారుల కథ ముగిసిపోయింది.

బాణం అనేది ఉద్దేశ్యం. అది విలుకాడు చేతిని వదిలి లక్ష్యం దిశగా బయలుదేరుతుంది. అంటే, అది స్వేచ్ఛగా తన ప్రయాణాన్ని, తను విడుదల అయేటప్పుడు ఎంచుకున్న మార్గాన్ని అనుసరిస్తూ కొనసాగిస్తుంది.

అది గాలి, గురుత్వాకర్షణ శక్తి వల్ల ప్రభావితం అవుతుంది. కానీ అది దాని పథంలో భాగం. తుఫాన్ చెట్టునుండి తుంపివేసినంత మాత్రాన ఆకు తన అస్తిత్వాన్ని కోల్పోదు.

మనిషి ఉద్దేశ్యం పరిపూర్ణంగా, సూటిగా, పదునైనదిగా, స్థిరమైనదిగా, కచ్చితమైనదిగా ఉండాలి. ఎవరిలో కూడా దానిని ఆపే శక్తి ఉండదు. దాని గమ్యస్థానం నుంచి దానిని వేరు చేయలేదు.

# విల్లు ఎలా పట్టుకోవాలి



ప్రశాంతంగా ఉండండి. లోతుగా గాలిపీల్చండి. మీ ప్రతి కదలికను అవసరమైతే మీ సహచరులు గమనిస్తూనే ఉంటారు.

మీ ప్రత్యర్థి కూడా మిమ్మల్ని గమనిస్తూనే ఉంటాడనే విషయం మరవకండి. అతనికి స్థిరమైన, అస్థిరమైన చేతుల మధ్య వ్యత్యాసం బాగా తెలుసు.

అందువల్ల మీకు ఉద్రిక్తంగా ఉంటే, లోతుగా గాలి పీల్చుకోండి. అది మీకు ప్రతిస్థాయిలో దృష్టి కేంద్రీకరించడానికి దోహదపడుతుంది.

మీరు విల్లును చేపట్టిన సమయంలో పొందికగా మీ శరీరాన్ని ముందు పెట్టుకున్నప్పుడు, గురికి సిద్ధమైన ప్రతి దశలోను మనసుతో వెళ్లడానికి ప్రయత్నం చేయండి.


ఎలాంటి ఆందోళన లేకుండా చేయండి. ఎందుకంటే అన్ని నియమాలను బుర్రలో పెట్టుకోవడం అసాధ్యం. ప్రశాంతమైన మనస్సుతో ప్రతి దశను సమీక్షించినప్పుడు మీకు మళ్లీ కష్టమైన క్షణాలు, సందర్భాలు గుర్తుకి వచ్చి, వాటిని మీరు ఏ విధంగా అధిగమించింది స్ఫురణకి వస్తాయి.

ఇది మీకు విశ్వాసాన్ని ఇస్తుంది. మీ చేయి వణకడం ఆగిపోతుంది.

# వింటి నారిని లాగడం ఎలా

విల్లు ఒక వాయిద్య పరికరం, దాని ధ్వని వింటి నారిలో అభివ్యక్తీకరించబడి ఉంది.

వింటి నారి అనేది పెద్దదే కానీ బాణం దానిపై కేవలం ఒక కేంద్రం వద్ద మాత్రమే తాకుతుంది. విలుకాళ్లందరి జ్ఞానం, అనుభవం ఆ ఒక్క చిన్న కేంద్రంపైనే కేంద్రీకరించబడి ఉంటుంది. విలుకాడు కొద్దిగా కుడికి లేదా ఎడమకి వంగినా, గురి చేసే రేఖకి ఆ బిందువుకి కొద్దిగా పైకి లేదా కిందకి జరిగినా అతను ఎప్పటికీ లక్ష్యాన్ని ఛేదించలేడు.





అందువల్ల, మీరు వింటినారిని లాగినప్పుడు వాద్యపరికరాన్ని ప్రయోగిస్తున్న సంగీతకారుడిలాగా ఉండాలి.

సంగీతంలో స్థలం కన్నా సమయానికి ప్రాముఖ్యత ఎక్కువగా ఉంటుంది. ఒక రేఖపై ఉన్న వరుసలో స్వరాలు  చూస్తే ఏమీ అర్థం కాదు. కానీ దానికి సంబంధించిన జ్ఞానం కలిగిన వారు ఆ పంక్తులు చదివి వాటిని ధ్వనులు, లయలోకి మార్చుకోలుగులుతారు.

విలుకాడు, లక్ష్యం ఉనికిని, సమర్థించినట్లే బాణం విల్లు ఉనికిని సమర్థిస్తుంది. మీరు చేతితో కూడా బాణాన్ని విసరగలరు. కానీ విల్లులేని బాణం వల్ల ఎలాంటి ఉపయోగం లేదు.

అందువల్ల మీరు చేతులను తెరుస్తున్నప్పుడు, విల్లుని సాగదీస్తున్నట్లు భావించకండి. బాణం గురించి ఆలోచించండి. బాణాన్ని ఒక కేంద్రంగా భావించి విల్లు రెండు చివరలను, వింటి నారిని దగ్గరకు చేర్చడానికి ప్రయత్నిస్తూ, వింటి నారిని సున్నితంగా తాకండి. వాటి సహకారాన్ని కోరండి.

# లక్ష్యాన్ని ఏ విధంగా చూడాలి



అనేక సంవత్సరాలు విలువిద్య కళను అభ్యసించినప్పటికీ, ఇప్పటికీ తమ గుండె దడదడలాడుతుందనీ, చేతులు వణకడంతో లక్ష్యం విఫలమవుతోందని అనేక మంది విలుకాళ్లు ఫిర్యాదు చేస్తున్నారు.

విల్లు లేదా బాణం ఏమీ మార్చలేవనే విషయం వారు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. విలు విద్య కళ మన తప్పులను మరింత స్పష్టంగా చూపుతుంది.

జీవితం పట్ల ప్రేమ లేకుండా ఉన్న రోజు మీ లక్ష్యం గందరగోళంగా, కష్టంగా ఉంటుంది.

వింటినారిని పూర్తిగా వెనక్కిలాగడానికి మీకు శక్తి చాలడడం లేదని గ్రహించి విల్లును ఎంత వరకు వంచాలో అంతవరకు మీరు వంచలేరు.

ఆ రోజు ఉదయం మీ లక్ష్యం పేలవంగా ఉండడాన్ని మీరు గమనించినప్పుడు అలాంటి అస్పష్టతకు కారణమేమిటనేది కనుగొనడానికి మీరు ప్రయత్నిస్తారు.


అంటే మిమ్మల్ని ఇబ్బంది పెడ్తున్న సమస్యను ఎదుర్కోవడం. అప్పటి వరకు ఆ సమస్య వెలుగులోకి రాకుండా దాక్కొని ఉంది. ఇందుకు విరుద్ధంగా కూడా జరగవచ్చు. మీ లక్ష్యం, వాస్తవం, వింటినారి, వాయిద్య పరికరం లాగా ధ్వనిస్తుంది. చుట్టూ పక్షుల కిలకిలారావాలు విన్పిస్తాయి.

అప్పుడు మీరు శాయశక్తులా ఉత్తమమైనది ఇస్తున్నారని తెలుసుకుంటారు.

ఉదయం మీరు ఏవిధంగా బాణ ప్రయోగం మంచిగానా లేక చెడుగానా అనే ఆలోచనతో నింపుకోకండి. ప్రతి బాణం జీవితం, మీ చెడు క్షణాలు ఉపయోగించి మిమ్మల్ని వణికింపజేస్తున్నదేమిటో కనిపెట్టండి. మీ మంచి క్షణాలను ఉపయోగించి మీ అంతర్గత శాంతికి మార్గాన్ని అన్వేషించండి.

భయంతోనో, ఆనందంతోనో ఆపకండి. విల్లు మార్గానికి అంతం లేదు.





# విడుదల చేసిన క్షణం

వేటు లేదా గురిలో రెండు రకాలు

మొదటిది ఆత్మతో ఏ విధమైన సంబంధం లేకుండా ఖచ్చితత్వంతో చేసే వేటు. ఈ విషయంలో విలుకాడుకి సాంకేతిక పరంగా గొప్ప పాండిత్యం ఉన్నప్పటికీ అతను కేవలం లక్ష్యం మీద మాత్రమే దృష్టి కేంద్రీకరిస్తాడు. అందువల్ల అతను పరిణతి చెందలేడు. ఎదగలేకపోయాడు. దానితో ఎదగడానికి తగిన కృషి చేయలేదు.

ప్రతీదీ కేవలం నియమిత చర్యగా మారిందని భావించి అతను ఏదో ఒక రోజు విల్లు మార్గాన్ని వదిలేస్తాడు.

ఇక రెండవ రకం వేటు విషయానికి వస్తే...

ఇది ఆత్మకు సంబంధించింది. విలుకాడి ఉద్దేశం బాణం దూసుకెళ్లడంగా రూపాంతరం చెంది, సరైన సమయంలో అతని చేతులు పనిచేస్తాయి. వింటినారి పక్షుల కిలకిలారావాన్ని ధ్వనింపచేస్తుంది. కొంత దూరంలో ఏదో విరుద్ధంగా రెచ్చగొడుతున్నట్లు, అది తిరిగి వచ్చి తనను ఎదుర్కొన్నట్లు బాణ ప్రయోగం సంకేతాన్నిస్తుంది.

విల్లును ఉపయోగించడంలో పాటించాల్సిన విషయాలు. సరిగ్గా ఊపిరి పీల్చుకోవాలి. లక్ష్యంపై దృష్టి కేంద్రీకరించాలి. మీ ఉద్దేశ్యం స్పష్టంగా ఉండాలి. భంగిమ పొందికగా ఉండాలి. లక్ష్యాన్ని గౌరవించాలి. అంతేకాదు ఈ ప్రపంచంలో ఏదీ కూడా చాలా కాలం మనతో ఉండదనే విషయం అర్థం చేసుకోవాలి. ఒక నిర్దిష్ట సమయంలో మీరు మీ చేతులను తెరిచి మీ ఉద్దేశ్యం తన గమ్యం చేరడానికి అనుమతి ఇవ్వాలి.



మీరు ఎంతగా ప్రేమించినా, చక్కగా, అనువుగా ఉండే భంగిమ కోసం మీరెన్ని ప్రయత్నాలు చేసినా, సరైన ఉద్దేశంతో ఉన్నా, దాని ఈకలను మీరు ఎంతగా ఇష్టపడినా, దాని రేఖను, దాని ఆకారాన్ని ఆరాధించినా, చివరికి బాణాన్ని వదిలి వేయాల్సిందే. అయితే విలుకాడు గురి చేయడానికి సిద్ధంగా లేకపోతే బాణం వెళ్లలేదు.

ఎందుకంటే, దూసుకువెళ్లడం అనేది క్షణికమైనది.

కచ్చితమైన భంగిమ, ఏకాగ్రత సాధించిన తర్వాత కూడా ఇది వెళ్లదు. ఎందుకంటే శరీరం ఈ ప్రయత్నాలను తట్టుకొని నిలబడ లేదు. చేతులు వణకడం ప్రారంభిస్తాయి.

విల్లు, విలుకాడు, లక్ష్యం అన్నీ ఒకే కేంద్రం మీదకి వచ్చినప్పుడే ఈ విశ్వంలోకి అది వెళ్లగలుగుతుంది. దీనినే స్ఫూర్తి అంటారు.

# పునరావృతం



సంజ్ఞ అనేది క్రియకు ప్రతి రూపం. చర్య అంటే ఆలోచనను వ్యక్తపరచడం ఒక చిన్న సంజ్ఞ మనకి ద్రోహం చేయవచ్చు.

కాబట్టి, మనం ప్రతిదాన్ని శుభ్రం చేసుకోవాలి. వివరాలను గురించి ఆలోచించాలి. సాంకేతికంగా నేర్చుకోవాలి. ఆ సాంకేతిక జ్ఞానం కూడా సహజమైనదిగా మారేలా ఉండాలి. అంతర్ దృష్టికి నియమిత చర్యతో సంబంధం లేదు కానీ మానసిక స్థితితో సాంకేతిక జ్ఞానానికి కి మించి సంబంధం ఉంటుంది.

బాగా సాధన చేసిన తర్వాత మనం కదలికల గురించి ఆలోచించాల్సిన అవసరం ఉండదు. అవి మన ఉనికిలో భాగం.

ఇలా జరగాలంటే మీరు తప్పక సాధన చేయాలి. పునరావృతం చేయాలి.

ఒక వేళ ఇది సరిపోకపోతే తిరిగి పునరావృతం చేయాలి. సాధన చేయాలి.

నైపుణ్యం కలిగిన ఫారియర్ (గుర్రాలకు నాడాలు వేసే వ్యక్తి) నేర్పరితనం చూడండి. తెలీనివారికి కేవలం సుత్తి దెబ్బలను పునరావృతం చేస్తున్నట్టు కన్పిస్తుంది.

కానీ విల్లు మార్గం గురించి తెలిసిన ఎవరికైనా ప్రతిసారి ఫారియర్ సుత్తి ఎత్తడం, కిందకు దించడం, ప్రతిసారి కొట్టే దెబ్బ తీవ్రత విభిన్నంగా ఉండడం అర్థం అవుతుంది.

అతని చేయి అవే సంజ్ఞలను పునరావృత్తం చేస్తుంది. కానీ ఆ చేయి లోహాన్ని చేరేటప్పటికి ఎక్కువ లేదా తక్కువ శక్తితో తాకాల్సిన విషయాన్ని అర్థం చేసుకుంటుంది.

కాబట్టి, పునరావృతంకి సంబంధించినంత వరకు ఒకే విషయంగా కనిపించినా అది ఎల్లప్పుడు విభిన్నంగానే ఉంటుంది.

గాలి మరను చూడండి.

గాలిమర రెక్కలను ఒకేఒక్కసారి చూసినట్లయితే అవి అదే వేగంతో తిరుగుతున్నట్లుగా, అవే కదలికలను పునరావృతం చేస్తున్నట్లుగా కనిపిస్తుంది.

అయితే, గాలిమర గురించి అవగాహన ఉన్న వారికి మాత్రం అది గాలి నియంత్రిస్తుందని, అవసరాన్ని బట్టి దిశను మార్చుకుంటుందని తెలుసు.

వేలాది సార్లు సుత్తితో కొట్టే సంజ్ఞలను పునరావృతం చేయడం ద్వారా ఫారియర్ చేయి శిక్షణ పొందుతుంది.

గాలిమర రెక్కలు గాలి తీవ్రంగా వీచినప్పుడు వేగంగా తిరుగుతాయి. దాని వల్ల గేర్లు సజావుగా నడుస్తున్నాయన్న నమ్మకాన్ని యిస్తాయి.

విలుకాడు లక్ష్యాన్ని దాటి సాగిపోయేలా అనేక బాణాలను వేస్తాడు. విల్లు యొక్క ప్రాముఖ్యత, భంగిమ, వింటినారి, లక్ష్యం సాధించాలంటే వేలాది సార్లు బాణం వేయడాన్ని పునరావృతం చేయాలి. పొరబాట్లు చేసినందుకు భయపడకుండా ఉండడానికి ఇది ఒక్కటే మార్గమని అతనికి తెలుసు.

అతని నిజమైన సహచారులు అతడిని ఎప్పటికి విమర్శించరు.

ఎందుకంటే సాధన అవసరమనే విషయం వారికి తెలుసు

అతని స్వభావాన్ని సుత్తి దెబ్బలతో పరిపూర్ణం చేయగల ఏకైకమార్గం ఇదే

ఆ తర్వాత తను ఏమి చేస్తున్నాడనే దాని గురించి విలుకాడు ఆలోచించాల్సిన అవసరం లేని సమయం వస్తుంది. అప్పటి నుండి విలుకాడు తను విల్లుగా, బాణంగా, లక్ష్యంగా మారిపోతాడు.



# బాణం వెళ్లడాన్ని
# ఏ విధంగా పరిశీలించాలి

ఒకసారి బాణాన్ని గురి చేసిన తర్వాత విలుకాడు దాని లక్ష్య మార్గాన్ని అనుసరించడం తప్ప వేరే ఏమీ చేయడానికి ఉండదు.

ఆ క్షణం నుండి బాణం వేయడానికి ఉద్విగ్నత అవసరమవుతుంది. ఆ తర్వాత ఆ ఉద్విగ్నత కొనసాగడానికి ఏ కారణమూ ఉండదు. అందువల్ల విలుకాడు బాణం వెళ్లే దిశగా తన దృష్టిని కేంద్రీకరించాల్సి ఉంటుంది. అతని మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. అతని ముఖంలోచిరునవ్వు కన్పిస్తుంది.





వింటినారిని వదిలేసిన చేయి ఒత్తిడితో తిరిగి వెనక్కి వస్తుంది. విల్లును పట్టుకున్న చేయి ముందుకెళ్తుంది. ఛాతి బహిర్గతం కాగా హృదయ పూర్వకంగా, మిత్రులు, ప్రత్యర్థులు తదేకంగా చూస్తుండగా, విలుకాడు తన చేతులను విస్తృతంగా చాచి ఎదుర్కోవాల్సి వస్తుంది.

ఒకవేళ, అతను తగినంత సాధన చేసి ఉంటే, తన ప్రవృత్తిని మెరుగుపరుచుకోగలిగి ఉంటే, తన పొందికను ఏకాగ్రతను బాణాన్ని ప్రయోగం చేసే మొత్తం ప్రక్రియలో, మొదటి నుండి చివర వరకు కొనసాగించగలిగితే, అతను ఆ క్షణంలో విశ్వం యొక్క ఉనికిని అనుభవించగలుగుతాడు. తన చర్య సరైనదేనని యోగ్యత కలిగినదని భావిస్తాడు.

రెండు చేతులు సిద్ధంగా ఉండడానికి శ్వాస కచ్చితంగా ఉండడానికి లక్ష్యంపై దృష్టి పెట్టేలా కళ్లకు శిక్షణ ఇవ్వడానికి సాంకేతికత అనుమతి ఇస్తుంది.

విడుదల క్షణం, పరిపూర్ణంగా ఉండేలా ప్రవృత్తి అనుమతిస్తుంది.

ఎవరైనా విలుకాడు దగ్గరకి వెళ్తున్నవారు, అతని చేతులు తెరిచి ఉండడం, అతని కళ్లు బాణాన్ని అనుసరించడం చూస్తే అక్కడ ఏమి జరగబోవడం లేదని అనుకుంటారు.

ఎవరైతే గురిచూసి వేటువేశారో ఆ వ్యక్తి యొక్క మనస్సు పరిస్థితి యొక్క తీవ్రతను మార్చిందని అతని మిత్రులకు తెలుసు. ఇది ఇప్పుడు మొత్తం విశ్వంతో సన్నిహితంగా ఉంది.

మనస్సు నిరంతరం పని చేస్తుంది. ఆ గురికి సంబంధించి అనుకూల విషయాలనన్నిటిని నేర్చుకుంటోంది. సాధ్యమైనన్ని తప్పులను సరిదిద్దుకుంటోంది. దాని మంచి లక్షణాలను స్వీకరిస్తోంది.

గురిచూసి కొట్టినప్పుడు లక్ష్యం ఏ విధంగా స్పందించింది అనేది చూడాలని వేచి చూస్తుంది.

విలుకాడు వింటినారిని లాగగానే ప్రపంచమంతటిని అతను తన విల్లులోనే చూడగలుగుతాడు.

అతను బాణం వెళ్తున్న దారిని అనుసరించినప్పుడు ప్రపంచం అతనికి దగ్గరగా చేరుతూ ఆదుకుంటుంది. విధిని నెరవేర్చిన కచ్చితమైన భావనను అతనికి కలిగిస్తుంది.

ప్రతి బాణం విభిన్నంగా దూసుకెళ్తుంది. మీరు వేయి బాణాలు వేయండి. ప్రతి బాణం విభిన్నమైన మార్గం అనుసరిస్తుంది. అదే విల్లు మార్గం.

# విల్లు, బాణం, లక్ష్యం లేని విలుకాడు



విల్లు మార్గం నిబంధనలనన్నిటిని మరిచిపోయినప్పుడు విలుకాడు పూర్తిగా  సహజబుద్ధితో నడుచుకోవడం నేర్చుకుంటాడు.

ఈ క్రమంలో అతను నిబంధనలను మరిచిపోయినప్పటికీ వాటిని గౌరవించాల్సిన వాటి గురించి నేర్చుకోవాల్సిన అవసరం ఉంది.

అతను ఈ దశకు చేరుకోగానే, అతనికి నేర్చుకోవడానికి సహాయపడే సాధనాల అవసరం ఉండదు. అతనికి విల్లు లేదా బాణాలు లేదా లక్ష్యం అవసరం ఇక ఉండదు. ఎందుకంటే మొదట అతన్ని మార్గంలో ఉంచిన ఈ సాధకాల కంటే, ఈ మార్గం అతనికి చాలా ముఖ్యమైనది.

అదే విధంగా చదవడం నేర్చుకునే విద్యార్థి, అక్షరాల నుండి బయటపడినప్పుడు, అక్షరాల నుండి పదాలను అల్లడం మొదలు పెడతాడు.

అయితే, ఒక వేళ ఆ పదాలు అన్నీ కలిసిపోయి కొనసాగితే ఆ పదాలకు అర్థం ఉండదు. లేదా వాటిని అర్థం చేసుకోవడం చాలా కష్టమవుతుంది. అందువల్ల ఆ పదాల మధ్య ఖాళీలు ఉండాలి.

ఒక చర్యకి, మరో చర్యకి మధ్య తను చేసిన పనులన్నిటిని విలుకాడు గుర్తు పెట్టుకుంటాడు. అతను తన సహచరులతో మాట్లాడుతాడు. అతను విశ్రాంతి తీసుకుంటాడు. తాను సజీవంగా ఉన్నాననే వాస్తవంతో తృప్తిగా ఉంటాడు.


విల్లుయొక్క మార్గం, ఆనందానికి, ఉత్సాహానికి, పరిపూర్ణతకి, పొరబాటుకి, సాంతికేతతకి, సహజ జ్ఞానానికి మార్గం.

"కానీ మీరు బాణాలను సంధించడం కొనసాగిస్తేనే మీరు వీటిని నేర్చుకోగలుగుతారు".





# ఉపసంహారం



టెట్సుయా మాట్లాడ్డం ఆపేసరికి, వారు వడ్రంగి వర్క్‌షాపు దగ్గరికి చేరారు.

"ఇంతసేపు నువ్వు నాతో ఉన్నందుకు కృతజ్ఞతలు". అని బాలుడితో చెప్పాడు టెట్సుయా. ఆ బాలుడు అక్కడ్నించి వెళ్ళలేదు.

"నేను చేస్తున్న పని సరైనదాకాదా అనే విషయం ఎలా తెలుసుకోవాలి? నా కళ్లు కేంద్రీకృతమై ఉన్నాయా, నా భంగిమ చక్కగానే ఉందా, నేను విల్లుని సరిగానే పట్టుకున్నానా లేదా? అనేది నేను కచ్చితంగా చెప్పగలనా?"

"ఒక పరిపూర్ణమైన గురువుని ఎల్లప్పుడు మీ ద్వారా చూసుకుంటాను. గురువుని పూజించడానికి వారు చెప్పే పాఠాలను గౌరవించడానికి కావాల్సినవన్నీ చేస్తాను.

ఈ గురువుని చాలా మంది దేవుడుగా పిలుచుకుంటారు. కొందరు అతన్ని 'విషయం' అని మరికొందరు 'ప్రతిభ అని పిలుచుకుంటూ ఎల్లప్పుడు మనని చూస్తూ ఉంటారు. ఉత్తమ గురువుగా అన్ని అర్హతలు కలిగిన వాడు.

"మీ స్నేహితులను కూడా గుర్తుంచుకోండి. మీరు వారికి మద్దతు ఇవ్వండి మీకు సహాయం అవసరమైనప్పుడు వారూ మీకు సహాయం చేస్తారు. దయ అనే బహుమతిని పెంచడానికి ప్రయత్నించండి. ఈ కానుక మీ మనస్సు ఎల్లప్పుడు ప్రశాంతంగా ఉండేలా చేస్తుంది.

కానీ, వీటన్నిటికీ మించి, నేను మీకు చెప్పినవన్నీ బహుశా స్ఫూర్తి కలిగించే మాటలు కావచ్చు. వాటిని అనుభవించినప్పుడు మాత్రమే అవి అర్థవంతమవుతాయని గ్రహించండి.

వీడ్కోలు చెప్పడానికి టెట్సుయా బాలుడి చేతిని పట్టుకున్నాడు. అప్పుడు ఆ కుర్రాడు "విల్లుని సంధించడం మీరు ఎలా నేర్చుకున్నారు?" అని అడిగాడు.

టెట్సుయా ఒక్క క్షణం ఆలోచించాడు. తన కథ చెప్పే అవసరం వుందా? ఈరోజు ప్రత్యేకమైన రోజు కనుక, చెబితే బావుంటుందనుకుని, వర్క్‌షాపు తలుపులు తెరిచి ఇలా అన్నాడు–

"నేను వెళ్లి టీ తయారు చేసుకొస్తాను. నీకు నా కథ చెబుతాను. కానీ నువ్వు ఆ కొత్తమనిషి చేత నేను ఎలా ప్రమాణం చేయించానో అలాగే నీ చేత "విలుకాడుగా నా నైపుణ్యం గురించి ఎవరికీ చెప్పనని" ప్రమాణం చేయించుకుంటాను అని చెప్పి లోపలికి వెళ్లాడు. దీపం వేశాడు.

విల్లుని మళ్లీ తోలు పట్టీతో బాగా చుట్టి ఎవరికీ కనిపించకుండా దాచిపెట్టాడు. పొరబాటున ఎవరన్నా దానిని చూసినా అది మెలిపెట్టినా వెదురుముక్క అనుకుంటారు.

టెట్సుయా వంట గదిలోకి వెళ్ళి, టీ తయారు చేసి బాలుడి పక్కన కూర్చుని తన కథ చెప్పసాగాడు.

"నేను నివసించిన ప్రాంతంలో గల ఒక గొప్ప వ్యక్తి కోసం పని చేస్తుండేవాడిని. అతని స్థిరాస్తులకు నేను అధికారిగా ఉండేవాడిని.

మా యజమాని ఎప్పుడూ ప్రయాణాలు చేస్తుండేవాడు. దాంతో నాకు బోలెడంత ఖాళీ సమయం ఉండేది. నేను జీవితానికి అసలైన అర్థం తాగుడు స్త్రీలుగా భావించి, వాటికి అంకితమై ఆనందంలో మునిగిపోవాలని నిర్ణయించుకున్నాను.

అనేక రాత్రులు నిద్ర లేకుండా గడిపిన తర్వాత ఒక రోజు మైకంగా ఉన్నట్లుగా అనిపించింది. గ్రామం మధ్యలో ఎక్కడో దూరంగా పడిపోయాను. నేను చనిపోతానని అనుకుని అన్ని ఆశలు వదులుకున్నాను.

అంతలో నేను అంతకు ముందు ఎప్పుడూ చూడని వ్యక్తి ఆ రహదారిలో వెళ్తున్నాడు. అతను నాకు సహాయం చేసి వాళ్లింటికి తీసుకెళ్లాడు. ఇక్కడికి ఆ ప్రదేశం చాలా దూరం. కొన్ని నెలల పాటు ఆయన నాకు సేవలు చేసి తిరిగి నన్ను ఆరోగ్యవంతుడ్ని చేశారు.

నేను అక్కడ కోలుకుంటున్నప్పుడే ప్రతి రోజు ఉదయం ఆయన విల్లు, బాణాలను సర్దుకుని బయలుదేరడం చూసేవాడిని.

నేను కోలుకున్నాక, నాకు విలు విద్య కళ నేర్పించమని ఆయనను అడిగాను. గుర్రాలను కాపలా కాయడం కన్నా ఇది చాలా ఆసక్తిగా అనిపించింది.

నాకు మృత్యువు చాలా సన్నిహితంగా వచ్చిందనీ, ఇప్పుడు దానిని తరిమికొట్టలేమని, కేవలం రెండు అడుగుల దూరంలో ఉందనీ, నేను నా శరీరానికి చాలా ఎక్కువగా హాని చేశానని చెప్పారు.

"ఒక వేళ నేను నేర్చుకోదలుచుకుంటే, కేవలం మృత్యువు నన్ను తాకకుండా దూరం పెట్టడానికే" అని చెప్పారు.

సముద్రానికి ఆవలి వైపున ఎక్కడో దూర ప్రదేశంలో ఉన్న ఆ వ్యక్తి, ఎత్తయిన కొండచరియలపై ఉన్న మృత్యువు దగ్గరకి దారి తీసే మార్గాన్ని కొంతకాలం నివారించడం ఏ విధంగా సాధ్యమవుతుందో నేర్పించారు.

నా విషయంలో నా జీవితంలో మిగిలిన రోజులలో నేను అగాధం అంచున నడుస్తున్నాననీ, నేను ఏ క్షణంలోనైనా అగాధంలోకి పడిపోవచ్చుననే విషయం గుర్తు పెట్టుకోవాల్సిన అవసరం ఉంది.

"ఆయన నాకు విల్లు మార్గం నేర్పించారు. నన్ను తన సహచరులకు పరిచయం చేశాడు. పోటీలలో పాల్గొనే విధంగా తీర్చిదిద్దారు.

త్వరలోనే నాఖ్యాతి ప్రపంచమంతా వ్యాపించింది.

నేను తగినంత నేర్చుకున్నానని ఆయన గ్రహించగానే, నా బాణాలను, లక్ష్యాన్ని ఆయన తీసేసుకుని విల్లుని మాత్రం–

జ్ఞాపకంగా వదిలేశారు. తన బోధనలను ఉపయోగించుకుని నిజమైన ఉత్సాహాన్ని కలిగించే ఏదో ఒక పని చేసుకోమని ఆయన నాకు చెప్పారు.

నాకు వడ్రంగి పని అంటే చాలా ఇష్టమని నేను చెప్పాను. ఆయన నన్ను ఆశీర్వదించి, తన దగ్గర నుండి వెళ్ళిపొమ్మన్నారు. విలుకాడుగా నా పేరు ప్రఖ్యాతలను, ఆనందాన్ని ధ్వంసం చేయకుండా, విలుకాడుగా కాకముందు ఏది నా ఆనందానికి హేతువైన ఆ జీవితానికి సాగిపొమ్మని చెప్పారు. నాకిష్టమైన పనికి అంకితమై సంతోషంగా ఉండమని నన్ను విలుకాడుగా నా ఖ్యాతి నన్ను అంతం చేయకముందే నాగత జీవితానికి తిరిగి వెళ్లేలా ఆశీర్వదించారు. అప్పటి నుంచి ప్రతి క్షణం నేను నా దుర్గుణాలకు వ్యతిరేకంగా నా మీద నాకే జాలికలగకుండా వుండేలా ఆనందంలో గడపడం కోసం పోరాడుతూనే ఉన్నాను.

ప్రశాంతంగా ఉండడానికి అవసరమైన వాటి మీద దృష్టి పెడ్తూ, నేను ఎంతగానో ఇష్టపడే పనిని ఎంచుకుని చేసుకుంటున్నాను. వర్తమానానికి నేను అతుక్కుని పోను. ఎందుకంటే మృత్యువు ఇప్పటికీ నాకు చాలా దగ్గరలోనే ఉంది. అగాధం నా పక్కనే ఉంది. నేను అగాధం అంచున నడుస్తున్నాను.

"మరణం అన్ని జీవులకు ఎల్లప్పుడూ దగ్గరగానే ఉంటుందనే విషయం టెట్సుయా కుర్రవాడికి చెప్పలేదు.

ఆ కుర్రవాడు చాలా చిన్నవాడు. అలాంటి విషయాల గురించి ఆలోచించాల్సిన అవసరం వాడికి లేదు.

మానవకార్యకలాపాలలో వేటిలోనైనా విల్లు మార్గం ఉంటుందని కూడా టెట్సుయా కుర్రవాడికి చెప్పలేదు.

కొన్నేళ్ల క్రితం ఒక వ్యక్తి తనను ఆశీర్వదించినట్టు టెట్సుయా ఆ కుర్రాడిని ఆశీర్వదించి ఇక వెళ్లమని చెప్పాడు. ఎందుకంటే అది చాలా సుదీర్ఘమైన రోజు. తనకి నిద్ర అవసరం.



# కృతజ్ఞతలు

జెన్ ఇన్ ది ఆర్ట్ ఆఫ్ ఆర్చరీ, డెర్బీ ఎడిషన్స్, 2016 రచయిత యూజెన్ హెర్రిజెల్ 'కి,

మిత్రుల లక్షణాల గురించి వివరించే ష్వాబ్ ఫౌండేషన్ ఫర్ సోషల్ ఎంటర్ ప్రీనర్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ పామెలా హార్టింగన్‌కి,

ఒనుమా-సాన్, క్యూడో, బుడో ఎడిషన్స్‌కి సంబంధించిన వారి పుస్తకం రచయితలు డాన్ మరియు జాకీ డిప్రాస్పెరోలికి, ఎన్‌కౌంటర్ బిట్వీన్ డెత్ అండ్ దినాగ్వల్ ఎలియాస్ గురించి వర్ణించిన కార్లోస్ కాస్టనీడకి.

# రచయిత గురించి

పాలో కొయిలో జీవితం అతని పుస్తకాల ప్రేరణకు ప్రాథమిక వనరు.

అతను మృత్యువుతో సరసాలాడాడు. పిచ్చితనం నుంచి తప్పించుకున్నాడు. మాదక ద్రవ్యాలతో చెలగాటమాడాడు. హింసను తట్టుకున్నాడు, మేజిక్, రసవాదంతో ప్రయోగాలు చేశాడు. తత్వశాస్త్రం, మతం గురించి అధ్యయనం చేశాడు. విస్తృతంగా చదివాడు. విశ్వాసాన్ని కోల్పోయాడు మరలా తిరిగి పొందాడు. ప్రేమలో బాధను, ఆనందాలను అనుభవించాడు. ఈ ప్రపంచంలో తన స్వస్థలాన్ని వెదికే ప్రయత్నంలో ప్రతి ఒక్కరూ ఎదుర్కొనే సవాళ్లకు సమాధానాలు కనిపెట్టాడు.

స్వంత గమ్యస్థానాన్ని కనుగొనడానికి అవసరమైనంత శక్తి అంతర్గతంగా మనలోనే ఉంటుందని విశ్వసించాడు.

పాలో కొయిలో పుస్తకాలు 83 భాషలలోకి అనువదింపబడినాయి. మరియు 320 మిలియన్లకుపైగా కాపీలు 170కిపైగా దేశాలలో అమ్ముడు పోయాయి. 1998లో ఆయన నవల ఆల్కెమిస్ట్ కాపీలు 85 మిలియన్లకుపైగా అమ్ముడు పోయాయి.

ఫారెల్ మిలియమ్స్, మలాలా యూసఫ్ జాయ్ వంటి విభిన్న మనస్తత్వాలు గల వ్యక్తులకి స్ఫూర్తిని కల్గించాయి పాలోకొయిలో రచనలు

ఆయన "బ్రెజిలియన్ అకాడెమీ ఆఫ్ లెటర్స్" సభ్యుడు. చెవాలియర్ డిఎల్ ఓర్డ్రే నేషనల్ డెలా లెజియన్ డి హోన్నూరు పొందారు. 2007లో "యునైటెడ్ నేషన్స్ మెసెంజర్ ఆఫ్ పీస్"గా గుర్తింపు పొందారు.

# ఇలస్ట్రేటర్ గురించి

జర్మనీలోని వైబ్లింగెన్‌లో జన్మించిన క్రిస్టోఫ్ నీయన్ ఒక కళాకారుడు, రచయిత  యానిమేటర్.

ది న్యూయార్కర్, నేషనల్ జియోగ్రాఫిక్ ది న్యూయార్క్ టైమ్స్ మ్యాగజైన్‌ల ముఖచిత్రాలుగా తరచూ కనిపిస్తాయి. క్రిస్టోఫ్ నీమాన్ చిత్రాలు ప్రదర్శింపబడ్డాయి.

ఆయన న్యూయార్కర్‌కి మొదటి ఆగ్‌మెంటడ్ రియాల్టీ కవర్ సృష్టించారు.

2010లో ఆయనను 'ఆర్ట్ డైరెక్టర్స్ క్లబ్ హాల్ ఆఫ్ ఫేమ్"లోకి ఆహ్వానించారు.

ఆయన అనేక పుస్తకాలను రచించారు. వాటిలో సండే స్కెచింగ్ (2016), వర్డ్స్ (2016) మరియు సావనీర్ (2017) వంటి మోనోగ్రాఫ్‌లు వున్నాయి.

ఇటీవల అతను రచించిన "హోప్స్ అండ్ డ్రీమ్స్' పుస్తకం లాస్ ఏంజిల్స్‌లో "మీ కళాత్మక హీరోను కలవండి" ట్రిప్పుకు నోచుకుంది.

క్రిస్టోఫ్ నీయన్ తన కుటుంబంతో బెర్లిన్‌లో నివసిస్తున్నారు.

# అనువాదకుని గురించి

**ఆ**కెళ్ళ శివప్రసాద్, రెండు వందలకి పైగా చిన్న కథలు, ఐదు నవలలు, ముప్పై నాటికలు, వెయ్యికి పైగా టీవీ ఎపిసోడ్స్, కొన్ని చలనచిత్రాలకి రచన చేశారు. ఇరవై కథలకి, రెండు నవలలకి, పలు పరిషత్తులలో నాటికలకి బహుమతులతోపాటు, రెండుసార్లు నంది అవార్డు, ఆకాశవాణిలో చేసిన రచనలకి ఐదుసార్లు జాతీయస్థాయిలో బహుమతులు వచ్చాయి.

కిటికీలోంచి వాన, మౌనభాష్యం కథల సంపుటులతోపాటు, బాలసాహిత్యం, అనువాద సాహిత్యం కలిపి యిప్పటివరకు పది పుస్తకాలు ప్రచురించబడ్డాయి.

akellasivaprasad@gmail.com